


నేటి పత్రిక

# ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వారపత్రిక



TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి.. చదవండి... చెప్పండి...



విజయవాడ | తేదీ: 8 - 15 ఏప్రిల్ 2023 | ఎడిటర్ : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి : 2 | సంచిక : 44 | పేజీలు : 4, వెల: రూ.5


## అత్యుత్తమ భీమా పథకం 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల భీమా పథకాన్ని దేశంలోనే అత్యుత్తమ పంటల భీమా పథకంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ-క్రాప్ ప్రామాణికంగా యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ప్రకటించింది. రైతులపై పైసా కూడా భారం పడకుండా నోటిఫైడ్ పంటలకు 100 శాతం భీమా కల్పిస్తున్న రాష్ట్రమని ఏపీపై ప్రశంసలు కురిపించింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)పై చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో గురువారం ప్రారంభమైన జాతీయ స్థాయి వర్కుషాపులో 'ఇన్నోవేషన్ కేటగిరి' కింద ఉత్తమ బీమా పథకంగా వైఎస్సార్ ఉచిత పంటల భీమా పథకాన్ని ఎంపిక చేశారు. ఈమేరకు కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా చేతుల మీదుగా రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

44 నెలల్లో రూ.6,684.84 కోట్ల పరిహారం..

నోటిఫై చేసిన పంటలకు సంబంధించి సాగు చేసిన ప్రతి ఎకరాకూ ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రామాణికంగా ఖరీఫ్ 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పంటల భీమా పథకాన్ని అమలు చేస్తోంది. గతంలో గరిష్టంగా 25.86 లక్షల హెక్టార్లలో పంటలకు భీమా కవరేజ్ కల్పించగా ప్రస్తుతం ఏకంగా 60 లక్షల హెక్టార్లలో కవరేజ్ వర్తింపచేశారు. 2018-19 సీజన్‌లో గరిష్టంగా రూ.1263 కోట్ల పరిహారం చెల్లించగా ఖరీఫ్ 2021 సీజన్‌కు సంబంధించి రికార్డు స్థాయిలో రూ.2,977.82 కోట్ల పరిహారం అందించారు. 44 నెలల్లో 44.28 లక్షల మంది రైతులు రూ.6,684.84 కోట్ల పరిహారాన్ని అందుకున్నారు. ఈ - క్రాప్ ప్రామాణికంగా యూనివర్సల్ కవరేజ్ కల్పించేందుకు కేంద్రం ముందుకు రావడంతో 2022-23 సీజన్ నుంచి పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానించి వైఎస్సార్ ఉచిత పంటల భీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఖరీఫ్ 2022 సీజన్‌కు సంబంధించి ఇప్పటికే నూరు శాతం ఈ - క్రాప్‌తో పాటు 97 శాతం ఈ-కేవైసీతో రికార్డు సృష్టించారు.

ఏపీ స్ఫూర్తితో మార్పులు : అహూజా

ఆంధ్రప్రదేశ్‌ను స్ఫూర్తిగా తీసుకుని జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజనలో పలు మార్పులు చేసినట్లు కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి మనోజ్ అహూజా వెల్లడించారు. పంటల బీమా అమలులో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వర్కుషాప్‌లో ఆయన ప్రశంసించారు. రైతులపై పైసా భారం పడకుండా మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించడం నిజంగా గొప్ప ఆలోచనన్నారు. నాలుగేళ్లుగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారని ప్రశంసించారు. ఏపీ ప్రభుత్వం సాధించిన విజయాన్ని కేంద్రం గుర్తించిందన్నారు. ఏపీ తరహాలోనే సీజన్ ముగియకుండానే భీమా పరిహారాన్ని అర్హత కలిగిన రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసేలా కసరత్తు జరుగుతోందన్నారు. పంటల భీమా పథకంతో పాటు రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అంకితభావాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. వర్కుషాప్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, బీమా కంపెనీల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈశాన్యంలో వైద్య సదుపాయాలు మరింత బలోపేతం : ప్రధాని నరేంద్ర మోదీ




**గువాహటి, నేటి పత్రిక ప్రజావార్త :**

ఈశాన్య రాష్ట్రాల్లో నూతన ఆసుపత్రులు, వైద్య కళాశాలల రాకతో వైద్య రంగంలో మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కాబోతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఈశాన్య భారతంలో సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం తొమ్మిదేళ్లుగా శ్రమిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు ఈశాన్య ప్రాంతాన్ని ఆమడ దూరంలో ఉంచాయని, తమ ప్రభుత్వం దగ్గరికి చేర్చుకుంటోందని వివరించారు. ఈశాన్య భారతదేశంలో నిర్మించిన తొలి అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను మోదీ శుక్రవారం జాతికి అంకితం చేశారు. అస్సాం రాజధాని గువాహటిలో రూ.1,123 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించారు. అలాగే నల్బారీ, నాంగావ్, కోక్రాజార్‌లో మెడికల్ కాలేజీలను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.546 కోట్లతో నిర్మించే అస్సాం అడ్వాన్స్‌డ్ హెల్త్‌కేర్ ఇన్నోవేషన్ ఇనిస్టిట్యూట్ (ఏఏహెచ్ఐఐ)కు పునాదిరాయి వేశారు. దీన్ని అస్సాం ప్రభుత్వం, ఐఐటీ-గువాహటి సంయుక్తంగా నిర్మించనున్నాయి. 1.1 కోట్ల ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. విపక్షాలు దేశాన్ని అప్రతిష్ట పాలు చేయడమే పనిగా పెట్టుకున్నాయని మండిపడ్డారు.

రైల్వే ప్రాజెక్టులు ప్రారంభించిన మోదీ

గువాహటిలోని ఇందిరాగాంధీ అథ్లెటిక్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో రూ.7,300 కోట్లతో కూడిన ఐదు రైల్వే ప్రాజెక్టులను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. బ్రహ్మపుత్ర నదిపై రూ.3,200 కోట్లతో పలాస్‌బారీ-సువాల్‌కుచీ బ్రిడ్జి నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేశారు. దిబ్రూగఢ్‌లో రూ.1,709 కోట్లతో నిర్మించిన మిథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అస్సాంలో సంప్రదాయ బిహూ నృత్యోత్సవంలో మోదీ పాల్గొన్నారు. 11,000 మందికిపైగా నృత్యకారులు, కళాకారులు అలరించారు. ఇక్కడ గురువారం నిర్వహించిన బిహూ నృత్యం రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సృష్టించడం తెలిసిందే.

**సాంకేతికతతో సత్వర న్యాయం**

**గౌహతి హైకోర్టు వార్షికోత్సవంలో మోదీ**

న్యాయసేవలు అందించే వ్యవస్థను మరింత వేగవంతం చేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. టెక్నాలజీతో సత్వర న్యాయం అందించవచ్చని, దీనివల్ల ఈశాన్య రాష్ట్రాల వంటి మూరుమూల ప్రాంతాల ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. శుక్రవారం అస్సాంలో గౌహతి హైకోర్టు 70వ వార్షికోత్సవ ముగింపు సభలో మోదీ ప్రసంగించారు. నూతన టెక్నాలజీతో ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. లక్షలాది మంది పౌరులకు ప్రాపర్టీ కార్డులు జారీ చేశామని ప్రధాని మోదీ వివరించారు. దానివల్ల ఆస్తుల సంబంధిత కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు.

## ఈ ఏడాదిలోనే పట్టాలపైకి వందే మెట్రో రైళ్లు



**ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :**

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రయాణికుల కోసం గుడ్ న్యూస్ చెప్పారు. వంద కిలోమీటర్ల పరిధిలో ఉండే ప్రధాన నగరాలను కనెక్ట్ చేసేలా మెట్రో రైల్ వ్యవస్థ 'వందే మెట్రో'ను ఈ ఏడాది చివర్లోనే పట్టాలు ఎక్కించనున్నట్లు ప్రకటించారాయన. సుదూర ప్రధాన నగరాలను కనెక్ట్ చేస్తూ తీసుకొచ్చిన సెమీ హై స్పీడ్ రైళ్లు 'వందేభారత్ ఎక్స్‌ప్రెస్' సక్సెస్ కావడంతో.. ఇప్పుడు తక్కువ దూరంలోని ప్రధాన నగరాలను అనుసంధానించేలా వందే మెట్రో రైళ్లను తీసుకురాబోతున్నట్లు ప్రకటించారాయన. ఈ ఏడాది చివర్లోనే ఈ రైళ్లు పట్టాలెక్కనున్నాయి. వందే భారత్‌తో పోలిస్తే వందే మెట్రో డిఫరెంట్‌గా ఉంటుంది. డిసెంబర్ కల్లా ఇది సిద్ధమవుతుందని పేర్కొన్నారాయాన. అంతేకాదు.. వందే భారత్‌కు వస్తున్న స్పందనకు అనుగుణంగానే వందే మెట్రోలను తీసుకొస్తున్నట్లు తెలిపారు. అధికారికంగా ప్రకటించకపోయినా.. ఉత్తర ప్రదేశ్ కాన్పూర్-లక్నో(90 కిలోమీటర్ల దూరం) నడుమ తొలి రైలు పట్టాలెక్కించాలని రైల్వే శాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది. లోకల్ రైళ్ల కంటే మెరుగైన రవాణా అందించే ఉద్దేశంతో వందే మెట్రో తీసుకువస్తున్నట్లు రైల్వేశాఖ చెబుతోంది. వేగంగా, రూట్‌లో ఫ్రీక్వెంట్‌గా సర్వీసులను నడపాలని నిర్ణయించుకుంది. తద్వారా ఉద్యోగులకు, విద్యార్థుల ప్రయాణాలకు వందే మెట్రో ఉపకరించొచ్చని రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ అభిప్రాయపడుతున్నారు. ఎనిమిది కోచ్‌లతో వందే మెట్రో రైళ్లను నడపాలని భావిస్తోంది. ఇప్పటికే చెన్నైలోని ఇంటీగ్రల్ కోచ్ ఫ్యాక్టరీకి, లక్నోలోని రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్‌కు రైల్వే శాఖ ఆర్డర్‌లు ఇచ్చినట్లు తెలుస్తోంది.

## జర్నలిస్టులకు రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభం

- శుక్రవారం నుండి ఆన్ లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

**- 2 సంవత్సరాల వ్యవధితో (2023,2024) అక్రిడిటేషన్ కార్డులు మంజూరు**

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

2023, 2024 సంవత్సరాలకు రాష్ట్రస్థాయిలో పాత్రికేయులకు స్టేట్ లెవల్ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసేందుకు శుక్రవారం నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు www.ipr.ap.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం క్రొత్తగా అక్రిడిటేషన్ కార్డుల మంజూరు కొరకు జీవో నంబర్ 38 (తేదీ:30.3.2023) తీసుకురావడంతో పాటు జీవో నంబర్ 40 ద్వారా స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల నియామకం పూర్తి చేసిన నేపథ్యంలో మొదటగా రాష్ట్రస్థాయిలో అక్రిడిటేషన్ల కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభించామని ఆయన తెలిపారు. జర్నలిస్టులు తమ వివరాలతో పాటు యాజమాన్యాల సిఫారసు లేఖ, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, అవసరమైన డాక్యుమెంట్లు పిడిఎఫ్ ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్ రెడ్డి తెలిపారు.

## వైఎస్సార్ ఈబీసీ నేస్తం రెండో విడత నగదు జమ కార్యక్రమంలో సీఎం జగన్

**ఒంగోలు, నేటి పత్రిక ప్రజావార్త :**

ప్రకాశం జిల్లా మార్కాపురంలో బుధవారం వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద రెండో విడత నగదు పంపిణీని అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. 4,39,068 మంది అక్క చెల్లెమ్మలకు రూ.658.60 కోట్లు లబ్ధి చేకూర్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత బరువు బాధ్యతలు భుజాన వేసుకున్న 45-60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అక్క చెల్లెమ్మల చేతిలో డబ్బులు పెడితే ప్రతి రూపాయి తమ కుటుంబం బాగోగుల కోసమే ఖర్చు పెడతారని దృఢంగా నమ్ముతున్నామన్నారు. అందుకే వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా అన్ని విధాలా తోడుగా నిలిచామని తెలిపారు. 'ఇప్పటికే వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు మంచి చేస్తున్నాం. అంతటితో ఆగిపోకుండా కాపు అక్కచెల్లెమ్మల కోసం వైఎస్సార్ కాపు నేస్తం పథకం ప్రారంభించాం. వీరందరితో పాటు ఓసీ వర్గాల్లోని పేద అక్కచెల్లెమ్మలకు మంచి చేయడం కోసం ఈబీసీ నేస్తం పథకానికీ శ్రీకారం చుట్టాం' అని చెప్పారు. ఈ రెండేళ్లలోనే వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా పేద అక్క చెల్లెమ్మలకు రూ.1,258 కోట్లు వాళ్ల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశామన్నారు. రెడ్లు, కమ్మ, ఆర్య వైశ్యులు, క్షత్రియులు, వెలమలు, బ్రాహ్మణులు తదితర ఓసీ కులాల్లో ఉన్నపేద అక్కచెల్లెమ్మలకూ ఇలా మేలు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టక పోయినా ఈబీసీ నేస్తం, కాపు నేస్తం పథకాలు తీసుకొచ్చామన్నారు.



ఈ 46 నెలల మీ బిడ్డ ప్రభుత్వంలో అమ్మ ఒడి మొదలు వైఎస్సార్ ఆసరా.. వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం.. వైఎస్సార్ ఈబీసీ నేస్తం, విద్యా దీవెన, వసతి దీవెన, షాదీతోఫా, కళ్యాణమస్తు.. విదేశీ విద్యా దీవెన వంటి అనేక పథకాల ద్వారా అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచామన్నారు. అక్కచెల్లెమ్మలకు ఇప్పటి వరకు రూ.2 లక్షల 7 వేల కోట్ల లబ్ధి చేకూర్చాం. ఇందులో రూ.లక్షా 42 వేల కోట్లు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా లంచాలు, వివక్షకు తావు లేకుండా నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి నేరుగా వెళ్లాయని చెప్పడానికి గర్వపడుతున్నాను. వైఎస్సార్ చేయూత ద్వారా 26,39,703 మందికి రూ.14,129 కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తం కింద 3.56 లక్షల మందికి రూ.1,518 కోట్లు, వైఎస్సార్ పెన్షన్ కానుక కింద 41.77 లక్షల మందికి రూ.40,094 కోట్లు, అమ్మ ఒడి కింద 44 లక్షల 48 వేల మందికి రూ.19,674 కోట్లు జమ చేశామన్నారు. ఏకంగా 30 లక్షల ఇళ్ల పట్టాలు అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాం. అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ ఇళ్లు పూర్తయితే ఒక్కో ఇంటి విలువ కనీసం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఉంటుంది. మొత్తంగా 30 లక్షల మందికి మంచి చేస్తూ రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల ఆస్తి నా అక్కచెల్లెమ్మల చేతిలో పెట్టినట్లవుతుందన్నారు..

మీ బిడ్డ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ ఇప్పటికే పూర్తయింది. రెండో టన్నెల్ ఈ సెప్టెంబర్, అక్టోబర్‌లో పూర్తి కాగానే మళ్లీ వచ్చి ప్రారంభిస్తాను. గతంలో నాన్న 36 కిలోమీటర్ల ఈ సొరంగాలను 20 కిలో మీటర్లు పూర్తి చేస్తే, ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు ఐదు కిలోమీటర్లు కూడా చేయలేదు. మీ బిడ్డ అధికారంలోకొచ్చాక యుద్ధప్రాతిపదికన ఆ మిగిలిపోయిన 11 కిలోమీటర్లు పూర్తి చేసి, ప్రాజెక్టును అక్టోబర్‌లో ప్రారంభించనున్నాం. మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి నా సోదరుడు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి నా దృష్టికి తెచ్చిన వాటికి ఇప్పుడే ఇక్కడే శంకుస్థాపన చేశాం. ఎన్ఎస్‌పీ కెనాల్ నుంచి పొదిలి దాకా అంటే 17 కి.మీ. పైపులైను ద్వారా పొదిలికి తాగునీరు అందించే కార్యక్రమానికి రూ.50 కోట్లతో పునాది వేశాం. మార్కాపురం మున్సిపాలిటీలో నీటి పనులకు రూ.5.20 కోట్లతో శ్రీకారం చుట్టాం. మెడికల్ కాలేజీ కోసం భూములిచ్చిన రైతులకు ప్రత్యామ్నాయంగా ఇచ్చిన 13 ఎకరాల అభివృద్ధికి సంబంధించి ఎకరాకు మరో రూ.3 లక్షలు ఇచ్చేందుకు అంగీకరిస్తున్నాం. పొదిలి మొయిన్‌రోడ్డు, పొదిలిలో డ్రెయిన్‌కు రూ.13 కోట్లు మంజూరు చేస్తాం. రూ.2 కోట్లతో షాదీఖానా, అంబేడ్కర్ భవనం, బీసీ భవనం మంజూరు చేస్తున్నామన్నారు.

విద్యా దీవెన, వసతి దీవెన కింద పిల్లల చదువుల కోసం రూ.13,351 కోట్లు ఖర్చు చేయగలిగాం. సంపూర్ణ పోషణ ద్వారా 35 లక్షల మంది బాలింతలు, గర్భిణులకు.. 6 నుంచి 72 నెలల చిన్నారులకు మంచి చేస్తూ రూ.6,131 కోట్లు ఖర్చు చేశాం. అక్కచెల్లెమ్మలకు భద్రత పరంగా 'దిశ' ద్వారా అండగా నిలిచాం. కోటి 17 లక్షల మంది దిశ యాప్ వారి ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నారు. నామినేటెడ్ పదవుల్లో, నామినేటెడ్ ద్వారా ఇచ్చే పనుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏకంగా చట్టం చేశాం. 21వ శతాబ్దపు ఆధు3నిక భారతీయ మహిళ మన రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి, ప్రతి ఇంటి నుంచి రావాలని తపన పడుతూ పాలన సాగిస్తున్నాం. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆదిమూలపు సురేష్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మేరుగు నాగార్జున, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నాయకులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

## భారత్‌లో ఫస్ట్ టైం నది కింద నుంచి మెట్రో పరుగులు



**ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :**

రైల్వే ప్రయాణంలో కోల్‌కతా (పశ్చిమ బెంగాల్) మెట్రో చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. నది కింద భాగం నుంచి మెట్రో రైలు పరుగులు తీయడానికి చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి అక్కడ. తద్వారా మన దేశంలోనే తొలిసారిగా ఇలాంటి అనుభూతిని ప్రయాణికులకు అందించబోతోంది. హుగ్లీ నదీ కింద భాగంలో కోల్‌కతా నుంచి నదీకి అవతలివైపు హౌరా మధ్య సుమారు 4.8 కిలోమీటర్ల దూరంతో ఈ అండర్‌గ్రౌండ్ ప్రయాణం సాగనుంది. ఈస్ట్‌వెస్ట్ మెట్రో కారిడార్‌లో.. హౌరా మైదాన్ నుంచి ఎస్ప్లానేడ్ స్టేషన్ల మధ్య ఈ రివర్ అండర్ గ్రౌండ్ కారిడార్‌ను ఏర్పాటు చేశారు. నీటి ఉపరితలం నుంచి 32 మీటర్ల లోతున మెట్రో టన్నెల్ ఏర్పాటు చేయగా.. ప్రయాణానికి 45 సెకన్ల టైం పట్టనుంది. బుధవారం టెస్ట్ రన్ విజయవంతంగా పూర్తైంది. ఈ ఫీట్‌ను మోడ్రన్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థలో ఇదొక విప్లవాత్మకమైన అడుగుగా కోల్‌కతా మెట్రో అధికారులు అభివర్ణిస్తున్నారు. అయితే ట్రయల్ రన్స్ మొదలుపెట్టి ఏడునెలలపాటు కొనసాగిస్తామని.. ఆ తర్వాతే పూర్తిస్థాయిలో రెగ్యులర్ ప్రయాణాలకు అనుమతిస్తామని అధికారులు చెప్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి నాలుగేళ్లకు పైనే పట్టింది. టన్నెల్ నిర్మాణాల వల్ల సమీప ప్రాంతాల్లోని నివాసాలు దెబ్బ తినగా.. అభ్యంతరాలు కూడా వ్యక్తం అయ్యాయి. చివరకు.. స్థానికులను ఒప్పించి, పరిహారం చెల్లించి నిర్మాణం పూర్తి చేసింది మెట్రో రైల్ కోల్‌కతా.

## జూలై ఒకటి నుంచి అమర్‌నాథ్ యాత్ర

**జమ్మూ, నేటి పత్రిక ప్రజావార్త :**



హిమాలయాల్లో కొలువైన అమర్‌నాథ్ ఆలయ వార్షిక యాత్ర జూలై ఒకటో తేదీ నుంచి మొదలుకానుంది. ఆగస్ట్ 31 దాకా కొనసాగనుంది. ఈ నెల 17వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుంది. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అధ్యక్షతన ఆలయ బోర్డు భేటీలో ఈ మేరకు నిర్ణయించినట్టు అధికారులు చెప్పారు. యాత్రకు వివరాల కోసం గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

# అంబేద్కర్ విశ్వ మానవుడు

: సీఎం కేసీఆర్



**హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త :**

ఎవడో డిమాండ్ చేస్తే విగ్రహం ఏర్పాటు చేయలేదని, అంబేద్కర్ విశ్వ మానవుడని.. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం విశ్వజనీనమైనదని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం హుస్సేన్ సాగర్ తీరాన ఏర్పాటు చేసిన అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభాస్థలి నుంచి ఆయన ప్రసంగించారు. ఎవడో డిమాండ్ చేస్తే విగ్రహం ఏర్పాటు చేయలేదు. ఈ విగ్రహ ఏర్పాటులో ఒక బలమైన సందేశం ఉంది. అంబేద్కర్ విశ్వమానవుడు. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం విశ్వనీయమైనది. అణగారిన వర్గాల ఆశాదీపం అంబేద్కర్. అంబేద్కర్ చెప్పింది ఆచరించేది ఉందా? లేదా? అని ఈ సందర్భంగా ఆయన అక్కడున్నవాళ్లను ప్రశ్నించారు.. అందరూ అంబేద్కర్ చెప్పిన మాటలు ఆచరించాలి. ఆయన ఆశయాల సాధన దిశగా ముందుకెళ్లాలి. ఇది కేవలం విగ్రహం కాదు.. ఒక విప్లవం. అంబేద్కర్‌ను చూడగానే అందరి మనసూ ప్రభావితం కావాలి. ఆయన సిద్ధాంతాలు స్మరణకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం. విగ్రహ ఏర్పాటునకు కృషి చేసిన వాళ్లందరికీ కృతజ్ఞతలు అని సీఎం కేసీఆర్ తెలిపారు. సెక్రటేరియెట్‌కు అంబేద్కర్ పేరు పెట్టుకున్నాం. అలాగే అంబేద్కర్‌పేరిట శాశ్వత అవార్డు ఇవ్వాలని నిర్ణయించాం. ఏటా అంబేద్కర్ జయంతి రోజు అవార్డుల ప్రదానం చేస్తాం. ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులు అందిస్తాం. ఇందుకోసం దాదాపు రూ. 50 కోట్లతో అంబేద్కర్ అవార్డు నిధి ఏర్పాటు చేస్తాం అని సీఎం కేసీఆర్ సభాస్థలి నుంచి ప్రకటించారు.

పార్టీలు కాదు.. ప్రజలు గెలవాలి. దళితుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాం. దళితుల ఆర్థికాభివృద్ధికి దళిత బంధు పథకం తీసుకొచ్చాం. కేసీఆర్ జాతీయ నేతగా ఎదగాలని ప్రకాష్ అంబేద్కర్ అన్నారు. దేశంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాబోయే రాజ్యం మనదే. మహారాష్ట్రలో ఊహించని ఆదరణ వస్తుంది. యూపీ, బీహార్, బెంగాల్‌లో కూడా ఆదరణ వస్తుంది. అన్ని రాష్ట్రాల్లో దళిత బంధు అమలు చేస్తాం అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ హాజరయ్యారు బీఆర్ఎస్ ఎంపీలు జే సంతోష్‌కుమార్, రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ మహారాష్ట్ర నేత, ఎన్సీపీ మాజీ ఎమ్మెల్యే శంకర్ అన్నా ధోంగే, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవ వనరుల అభివృద్ధిలో భారత్ నెం.1

**హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త :**



ప్రపంచవ్యాప్తంగా చిన్న పిల్లలకు ఇస్తున్న వ్యాక్సిన్‌లలో 65 శాతం ఇండియాలో ఉత్పత్తి అయిన వ్యాక్సిన్‌లే ఉన్నాయని పద్మభూషణ్ అవార్డుగ్రహీత, భారత్ బయోటెక్ వ్యవస్థాపక ఛైర్మన్ కృష్ణ ఎల్ల వెల్లడించారు. శుక్రవారం జరిగిన హైదరాబాద్ ఐఐటీ ఆవిర్భావ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. మానవ వనరుల అభివృద్ధిలో భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇండియాలో డిజిటల్ ఎకానమీ 34 శాతం ఉంటే అభివృద్ధి చెందిన అమెరికా, ఫ్రాన్స్‌వంటి దేశాల్లో 8 శాతం లోపే ఉందని పేర్కొన్నారు. వ్యాక్సినేషన్, ఫార్మా తదితర రంగాలను ప్రపంచ రాజకీయాలు ఎంతో ప్రభావితం చేస్తున్నాయని కృష్ణ అభిప్రాయపడ్డారు. కొన్ని దేశాలు వ్యాక్సిన్ ఎగుమతి చేసి, బదులుగా ఆయా దేశాల నుంచి విలువైన ఖనిజాలను దిగుమతి చేసుకుంటున్నాయని వివరించారు. వ్యవసాయరంగం అభివృద్ధితో పాటు నూతన ఆవిష్కరణలు దేశాన్ని ఆర్థికాభివృద్ధి వైపు నడిపిస్తాయన్నారు. ఇంగ్లిష్ పెద్దగా తెలియని చైనా నూతన ఆవిష్కరణల్లో ముందంజలో ఉందన్నారు. వైరస్‌ల కారణంగా పుట్టుకొస్తున్న వ్యాధుల పట్ల అలసత్వం వద్దని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాధుల మూలాలను ఎప్పటికప్పుడు గుర్తించి ఎక్కడికక్కడ సరైన వైద్యం చేసి కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మడగాస్కర్‌లో పుట్టిన చికున్‌గున్యా ఇండియాకు విస్తరించిందనీ ఆఫ్రికా దేశాల్లో పుట్టిన జికా వైరస్ బ్రెజిల్ వంటి దేశాలకు విస్తరించిందని తెలిపారు. ఐఐటీహెచ్‌లోని వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ పాలకవర్గం ఛైర్మన్ బీవీజీ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్యోతిబా ఫూలే, అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జర్నలిస్టులకు ప్రభుత్వ చిరు సత్కారం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని సి ఆర్ ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మనేని శ్రీనివాసరావు అన్నారు. మహాత్మా జ్యోతిబాఫూలే, బాబాసాహెబ్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం, ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడ ఎం.జి.రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మీడియా రంగంలో విశేష కృషి చేసిన జర్నలిస్టులకు, ఉద్యోగులకు గురువారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ..జ్యోతిబాఫూలే, అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని జర్నలిస్టులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. సి.ఆర్. ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన దగ్గర్నుంచి జర్నలిస్టుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి వినూత్న కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముమ్మందు కూడా జర్నలిస్టుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు.

మందపాటి శేషగిరిరావు, రాష్ట్ర గ్రంథాయల సంస్థ ఛైర్మన్ మాట్లాడుతూ..జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా సత్కార కార్యక్రమం స్వయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మీడియా రంగంలో విశేష సేవలు అందించిన 11 మంది జర్నలిస్టులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం, సి.ఆర్.ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రెస్ అకాడమి మాజీ ఛైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథరెడ్డి మృతిపట్ల 2 నిమిషాలపాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నిమ్మరాజు చలపతిరావు, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు, మేడపాటి వెంకట్, ఏపీ ఎన్ఆర్టీఎస్ ఛైర్మన్, ఎస్.వెంకటరావు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, జి.శాంతమూర్తి, వైఎస్సార్ మేధావుల ఫోరం ఛైర్మన్, సి.ఆర్.ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి సెక్రటరీ మామిడిపల్లి బాల గంగాధర తిలక్, ఓఎస్డీ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# "ఫెర్మెంటేషన్ యూనిట్ " స్థాపన కోసం ప్రభుత్వ సబ్సిడీ 35 శాతం

**రాజమహేంద్రవరం, నేటి పత్రిక ప్రజావార్త :**



కొబ్బరి తోటల్లో అంతర పంటగా, కోకో మొక్కలు పెంచడం ద్వారా ఆ పంటకి మెరుగైన ధర లభింప చేసే విధానంలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అడుగులు అనుసరణీయం అని ప్రముఖ చాక్లెట్ టేస్టర్ నితిన్ కార్డియా పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో రెండు రోజుల పాటు సిటిఆర్ఐ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజులు పాటు నిర్వహించిన సదస్సు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కోకో వేల్యూ చైన్ మీద నిర్వహించిన సదస్సు ప్రాధాన్యత సంతరించుకునే దిశలో ఫలవంతంగా నిర్వహించారు. కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాలకి చెందిన 100కి పైగా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు హాజరు కావడం శుభ పరిణామంగా వక్తలు పేర్కొనడం జరిగింది.

ఈ సదస్సులో భారతదేశపు మొట్టమొదటి చాక్లెట్ టేస్టర్ అయిన .. నితిన్ కార్డియా అంతర్జాతీయంగా ఎన్నో చాక్లెట్ కంపెనీలకి సేవలందించిన వారు కోకో సాగులో మరియు చాక్లెట్ తయారీలో తమకున్న అపారమయిన అనుభవాన్ని రైతులతో పంచుకున్నారు. ఈ సదస్సుకి హాజరు అయిన ప్రధానమంత్రి ఫార్మాలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసంగ్ ఎంటర్ ప్రైజెర్స్ పథక సంచాలకులు సుభాష్ కిరణ్ మాట్లాడుతూ రైతులకి ఈ విషయములు ఏవిధమయిన ఆ మరియు సాంకేతిక తోడ్పాటుని అందించటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందని 35% రుణ ఆధారిత సబ్బిడి అందించే ఏర్పాటు ఉందని తెలియజేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. రామ్మోహన్ మాట్లాడుతూ మన రాష్ట్రం లో ప్రస్తుతం ఉత్పత్తి కాబడుతున్న కోకో జీన్స్ కేవలం 10 వేల మెట్రిక్ టన్నులు లని, కానీ కాడ్బరీ సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం 50 వేల మెట్రిక్ టన్నుల వినియోగించగలిగే యూనిట్ శ్రీసిటీ లో స్థాపించని ఎన్నో వేల మెట్రిక్ టన్నుల డిమాండ్ ఉందని, కాబట్టి మార్కెటింగ్ గురించి రైతు అసలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ సదస్సుకి సెర్ఫ్ అడిషనల్ డైరెక్టర్ మహిత, జిల్లా హారికల్చర్ ఆఫీసర్ రాహ, సెర్ఫ్ జిల్లా సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు, రైతు సంఘాల ఎవరయినా ఈ పద్దతుల గురించి, ప్రభుత్వ సహకారం గురించి మరింత సమాచారం కొరకు ఫుడ్ ప్రాసెసింగ్ జోనల్ మేనేజర్ కే.జె.మారుతీని ఈ నెంబర్ ద్వారా 7893347474 సంప్రదించగలరు.

## ఈనెల 15 నుండి 61 రోజులు సముద్రంలో చేపల వేట నిషేధం : జిల్లా కలెక్టర్

**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాలలో చేపల వేట చేయు యాంత్రిక పడవలు అనగా మెకనైజ్డ్ మరియు మోటారు బోట్‌లు ద్వారా నిర్వహించు అన్నిరకాల చేపల వేటను ఈనెల 15 నుండి జూన్ 14 వరకు 61 రోజులు పాటు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చేపల వేట నిషేధం అమలులో ఉంటాయని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సముద్ర జలాలలో చేపల వేట నిషేధం ఉద్దేశ్యం- వివిధ చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలములో తల్లి చేపలు మరియు రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రత్సహించడం, తద్వారా సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాదించడం కోసమని అన్నారు. సముద్ర జలాలలో యాంత్రిక పడవలు ( మెకనైజ్డ్ మరియు మోటారు బోట్ల ) పై మత్స్య కారులు ఎటువంటి చేపల వేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించి చేపల వేట చేసిన యెడల ఆయా బోట్ల యజమానులు ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమ బద్దీకరణ చట్టము 1994, సెక్షన్ (4) ను అనుసరించి శిక్షర్హులు, అట్టి వారి బోట్లను, బోట్లలో ఉండే మత్స్య సంపదను స్వాధీన పరచుకొనుటయే గాక, జరిమానా విధిస్తు, డీజిల్, ఆయిల్ రాయితీ మరియు ప్రభత్వం అందించే అన్ని రకముల రాయితీ సౌకర్యాలను నిలుపుదల చేయబడునని తెలిపారు. ఈ నిషిద్ధ కాలమును ఖచ్చితంగా అమలు చేయుటకై మత్స్యశాఖ, కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవి మరియు రెవిన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేయడమైనదని, కావున మత్స్యకారులందరు సహకరించవలసినదిగా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడపగడపకు : దేవినేని అవినాష్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలును ప్రజలకు వివరించి వారి సమస్యల తక్షణ పరిష్కారం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టడం జరిగిందని తూర్పు నియోజకవర్గ వైస్సార్సీపీ ఇన్‌ఛార్జ్ దేవినేని అవినాష్ పేర్కొన్నారు. గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 5వ డివిజన్ 19వ సచివాలయం పరిధిలోని పెద్దబావి సెంటర్‌రోడ్ నుండి మొదలై మల్లెల వారి స్ట్రీట్, మట్టా వారి స్ట్రీట్,మాచెర్ల స్ట్రీట్ ప్రాంతాలలో నాయకులతో అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురుంచి వివరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని, ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారు అని అన్నారు. వైస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే నవరత్నాలతో పేదల బ్రతుకుల్లో వెలుగులు నిండాయని, వారికి ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వ పాలన కొనసాగుతుంది అని అన్నారు. కొండప్రాంతంలో పర్యటిస్తుంటే గత టీడీపీ ప్రభుత్వంలో మమ్మల్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే నేడు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొండంచున నివసిస్తున్న మా వద్దకే వలంటీర్ లు వచ్చి పెన్షన్ అందించడంతో పాటు, చివరి ఇంటి వరకు మంచినీటి పైప్ లైన్ వేసి మా కష్టాలు తీర్చిన దేవుడు జగనన్న అని మహిళలు వారి సంతోషాన్ని వ్యక్తం చేస్తుంటే చాలా గర్వంగా ఉంది అని అవినాష్ అన్నారు. రాష్ట్రంలో గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారు కాబట్టే నిన్న స్వయానా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కూడా అధికారంలోకి వస్తే ఆ సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని చెప్పారంటేనే అర్థం అవుతుంది ప్రజల గుండెల్లో అవి ఎంతగా నిలిచి ఉన్నాయని అన్నారు. ప్రజలు కూడా మంచి చేస్తున్న ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలని మరలా వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని అవినాష్ కోరారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ కార్పొరేటర్ అంబేద్కర్ డివిజన్ అధ్యక్షులు ప్రసాద్ వైస్సార్సీపీ నాయకులు విటల్, లోకేష్ లామ్ కిరణ్, అప్పారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి అవకాశాలకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ దరఖాస్తులు

**రాజమహేంద్రవరం, నేటి పత్రిక ప్రజావార్త :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 18 నుండి 45 సంవత్సరాలు లోపు గల మహిళకు హౌస్ కీపింగ్, కుకింగ్, మరియు కేర్ టేకర్ శిక్షణ తో పాటు గల్ఫ్ దేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమానికి అభ్యర్థుల నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ దరఖాస్తులు కోరుతోందాని జిల్లా నైపుణ్యాధికారి ఎం కొండలరావు శనివారం ఒక పప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కొద్ది మంది మహిళలు ఉపాధి కొరకు నకిలీ ఎజెంట్ల మోసాల వలలో చిక్కుకుని సరైన అర్హతలు పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లి అక్కడి చట్టాలు తెలియక మోసపోయి ఇబ్బందులు పడుతున్న విషయం గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగం గా రాష్ట్రం లో మూడు చోట్ల అనగా తూర్పు, పశ్చిమ గోదావరి మరియు కడప జిల్లాలో హౌస్ కీపింగ్, కుకింగ్ మరియు కేర్ టెకర్ అంశాలపై శిక్షణ ప్రారంబించబడుతుంది. ఈ శిక్షణలో భాగముగా విదేశాలలో అనుసరించే మత పరమైన సంస్కృతులు, వారి పద్దతులు, అలవాట్లు విధానాలు తో పాటు ఆయా దేశాల చట్టాల గురించి అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. శిక్షణ అనంతరం వీరికి గల్ఫ్ దేశాలలో ఉపాధి చూపించడం జరుగుతుంది.

ప్రభుత్వ అజమాయిషీలో జరిగే కార్యక్రమం కాబట్టి నకిలీ ఏజెంట్లు బారిన పడి మోసపోవడం అనేది ఉండదు. వీరి ఉపాధికి ప్రభుత్వం భాధ్యత వహిస్తుంది. ఉపాధి పొందే ప్రాంతం యొక్క పరిస్థితులు అక్కడి ప్రజల మత పరమైన ఆచారాలు, భాష వంటి వ్యవహారాలపై శిక్షణ పొందుతారు కాబట్టి సదరు విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉంటారు. ఆ దేశపు చట్టాలపై పూర్తి అవగాహన కల్పిస్తారు కాబట్టి పొరపాట్లు చేయడానికి ఆస్కారం ఉండదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సంబందిత విభాగాలలో తగిన శిక్షణ పొందడం వలన ఎటువంటి శిక్షణ లేని వారి కంటే మరింత అధిక ఆదాయం గల మెరుగైన ఉపాధి అవకాశాలుతో పాటు ఉద్యోగ భద్రత కలిగి ఉంటారు. ఉపాధి పొందడానికి వెళ్లిన ఉద్యోగికి పనికి తగ్గట్టు ఆ దేశ చట్టాల ప్రకారం తగిన జీతభత్యాలు పొందుతున్నారో లేదో గమనించడం తో పాటు అక్కడ జీత భత్యాలలో మరియు పనిచేసే ప్రాంతంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తిన సందర్భంలో భారత రాయబార కార్యాలయం భాధ్యత తీసుకుని వారికి తగిన సహాయం అందిస్తుంది.

ఎవరు అర్హులు?

5 వ తరగతి చదివి ఉండాలి, చదవడం రాయడం తెలిసి ఉండాలి, వయసు 18 నుండి 45 లోపున్న మహిళలు కు మాత్రమే ఈ శిక్షణకు అర్హులని ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలు కు దయచేసి 9581810049, 9948995678 నందుసంప్రదించగలరు.

## సంతృప్తస్థాయిలో సంక్షేమ పథకాల అమలు : ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :

ప్రజలందరికీ సంతృప్తస్థాయిలో సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. గురువారం 63వ డివిజన్ 276 వ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి మల్లాది విష్ణు పాల్గొన్నారు. సుందరయ్యనగర్లో విస్తృతంగా పర్యటించి.. 193 గడపలను సందర్శించారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వయానా సంతకం చేసిన సంక్షేమ బుక్ లెట్లను అందజేశారు. విద్యా, వైద్య, గృహ నిర్మాణ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోన్న ప్రాధాన్యత.. అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, పేదలందరికీ ఇళ్ల పథకాలను ప్రవేశపెట్టడం వెనుక గల ఆవశ్యకతను లబ్ధిదారులకు వివరించారు. కరోనాతో ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంతో తల్లడిల్లినా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని సీఎం వైఎస్ జగన్ ఆపలేదన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాజకీయాలలో ప్రతిపక్షాలు ఎప్పుడూ హుందాతనం పాటించాల్సిన అవసరం ఉందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు అన్నారు. చివరకు నోరులేని మూగ జీవాలపైనా రాజకీయాలు చేసే స్థాయికి టీడీపీ నాయకులు దిగజారారని మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబు తన భాష, పద్ధతి మార్చుకోవాలని మల్లాది విష్ణు సూచించారు. 276వ సచివాలయ పరిధిలోని ప్రజలు చూపిన ప్రేమానురాగాలు మరువలేనివని మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ(వాటర్ సప్లై) రామకృష్ణ, ఏఈ అరుణ్ కుమార్, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, ఆర్ఐలు ప్రసాద్, సరత్, సీడీఓ జగదీశ్వరి, డివిజన్ కోఆర్డినేటర్ పసుపులేటి యేసు, నాయకులు మోదుగుల గణేష్, సీహెచ్ రవి, నాగు, టెక్యం కృష్ణ, సామ్రాజ్యం, నాగలక్ష్మి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యంత ధనిక ముఖ్యమంత్రులలో జగన్ మోహన్ రెడ్డి నెంబర్ వన్ : పోతిన వెంకట మహేష్

- అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**

జనసేన పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి పోతిన వెంకట మహేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వం కార్యక్రమం 43వ డివిజన్ అధ్యక్షులు జల్లి రమేష్ ఆధ్వర్యంలో ఊర్మిళనగర్ బ్రహ్మం గారి గుడి వద్దనుండి ప్రారంభించి ఊర్మిళనగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. మీడియా పాయింట్ వద్ద పోతిన మహేష్ మాట్లాడుతూ ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లడం జరిగిందని ప్రతి ఒక్కరూ కూడా తమ సమస్యలను అనేకం చెప్పుకుంటున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలు, పెట్రోల్, గ్యాస్ ధరలు, టిడ్కో ఇల్లు, రోడ్డు, డ్రైనేజీ, నీటిపారుదల లేక దోమల బెడద తదితర సమస్యలు పెరిగి, ఉపాధి అవకాశాలు గానీ, ఉద్యోగ అవకాశాలు గాని, ఆదాయం గాని పెరగలేదని తెలిపారు. 29 రాష్ట్ర ముఖ్యమంత్రి ఆస్తులు మొత్తం కలిపి లెక్క వేసిన కూడా జగన్మోహన్ రెడ్డి ఆస్తులు ముందు దిగదుడిపేనని, జగన్మోహన్ రెడ్డి ఒక్కరి ఆస్తే ఇంతుంటే ఆయన భార్య పిల్లల యొక్క ఆస్తులు ఆయన బినామీల యొక్క ఆస్తులు ఇంకా ఎన్ని వేల కోట్లు ఉంటదో మనం అందరం అర్థం చేసుకోవాలని, ఇంత ధనికుడైన జగన్మోహన్ రెడ్డి నాకు అంగ బలం లేదని, అర్థ బలం లేదని హాస్యస్పద మాటలు మాట్లాడుతున్నాడన్నారు. అత్యంత ధనిక ముఖ్యమంత్రులలో జగన్ మోహన్‌రెడ్డి నెంబర్ వన్ స్థానంలో ఉన్నారని కానీ ఈ రాష్ట్రాన్ని మాత్రం అత్యధిక అప్పులు ఉన్న రాష్ట్రంలో నెంబర్ వన్ గా నిలబెట్టారన్నారు. పేద సామాన్య ప్రజలకి కౌలు రైతులకు ఈ రోజు అండగా నిలబడిన ఏకైక వ్యక్తి మా పవన్ కళ్యాణ్ అని పవన్ కళ్యాణ్ సంపాదించిన డబ్బుల్లో కోట్ల రూపాయల కౌలు రైతులుకు ఆర్థిక సాయం మా నాయకుడు చేస్తున్నారని మరి జగన్ మోహన్ రెడ్డి ఒక్క కౌలు రైతుకు కూడా ఎక్కడా కూడా పదివేల రూపాయలు కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకురాలు ఆలమూరు శ్రీదేవి, 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష, డివిజన్ స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

# చండీ, రుద్ర, రాజ శ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ నిర్ణయం మేరకు, ఆగమ సలహా మండలి సూచనలతో జోతిష్య దైవజ్ఞులు నిర్ణయించిన ముహూర్తంను అనుసరించి రాష్ట్ర ముఖ్య మంత్రి అనుమతితో 108 కుండములు మరియు 2 ప్రధాన కుండములతో రాష్ట్రములో గల 8 ఆగమములను అనుసరించి రాష్ట్ర అభివృద్ధి మరియు రాష్ట్ర కళ్యాణం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వంచే దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా చేస్తున్న మహా యజ్ఞం.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు దేవాదాయ ధర్మాదాయశాఖ మాత్యులు కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్‌రెడ్డి ఈ మహా యజ్ఞం నిర్వహణ నిమిత్తం రెవెన్యూ (దేవాదాయ శాఖ) సెక్రటరీ మరియు కమీషనరు, దేవాదాయ ధర్మాదాయశాఖ, యస్. సత్యనారాయణ, యన్.టి.ఆర్. జిల్లా కలెక్టరు, సిటీ పోలీసు కమీషనరు, మున్సిపల్, ఫైర్, ఎలక్ట్రికల్, ఆర్.అండ్.బి మరియు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఈ మహా యజ్ఞం నకు వివిధ డిపార్టుమెంట్లనుండి చేయవలసిన ఏర్పాట్లను చీఫ్ సెక్రటరీ క్యాంప్ కార్యాలయమునందు సమీక్షించారు.

ది.21.3.2023న ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ 3వ సమావేశంలో ధార్మిక పరిషత్ చైర్మన్, ఇతర సభ్యులు మరియు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన డైరెక్టర్, అర్చక ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, రాష్ట్ర ప్రభుత్వంచే ఇటీవల ఏర్పాటు చేయబడిన ఆగమ సలహా మండలి సభ్యుల తీర్మానమును అనుసరించి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సంపద, ఆరోగ్యం, పాడిపంటల వృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వంచే దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఒక మహా యజ్ఞం విజయవాడ లో నిర్వహించవలెనని తీర్మానం చేయబడినది.

ప్రముఖ జ్యోతిష్య పండితులతో ఉప ముఖ్యమంత్రి సంప్రదించిన మేరకు ది.12.05.2023 శుక్రవారం నుండి ది.17.05.2023 వరకు ఇట్టి యజ్ఞంను విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు నిర్వహించ నిర్ణయించడమైనది.

ముహూర్తం:- స్వస్తి శ్రీ చాంద్రమాన శోభాకృత్ నామ సంవత్సర ఉత్తరాయణం నందు వసంత ఋతువు వైశాఖ బహుళ సప్తమి శుక్రవారం అనగా ది.12.5.2023 ఉదయం బ్రాహ్మి ముహుర్తం నందు శ్రీ విఘ్నేశ్వర పూజతో శ్రీ లక్ష్మి మహా యజ్ఞం ప్రారంభమై ది.17.05.2023 బుధవారం మధ్యాహ్నం మహాపూర్ణాహుతి తో సంపూర్ణం అవుతుంది. రాష్ట్ర శ్రేయస్సు, ప్రజల సౌభాగ్యం, సంపద, దర్మాభివృద్ధి, వ్యవసాయ పంటల అధిక దిగుబడి కొరకు ఈ మహా యజ్ఞం నిర్వహింపబడుతుంది.

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహణలో వైఖానసము, పాంచరాత్రం, వైదిక స్మార్తం, శైవం, చాత్తాద శ్రీ వైష్ణవం, గ్రామదేవత ఆరాదనము, వీర శైవం, తంత్రసారము అనే 8 ఆగమముల ప్రకారం హెూమ %--% పారాయణములు సంప్రదాయ బద్ధంగా నిర్వహించడం జరుగుతుంది.

ప్రతీరోజు ఉదయం, సాయంత్రం యాగం నిర్వహించబడును. ప్రతీరోజు ఉదయం విష్ణు సహస్రనామ పారాయనాధులు జరుగును. ప్రతీ రోజు సాయంకాలం శాంతి కళ్యాణ మహెూత్సవములు నిర్వహింపబడును. సింహాచలం, అన్నవరం, ద్వారకాతిరుమల, కనకదుర్గ అమ్మవారు, శ్రీశైలం దేవాలయముల నుండి రోజుకు ఒక దేవాలయం చొప్పున శాంతి కళ్యాణం నిర్వహించబడును.

దేవాదాయ ధర్మాదాయ శాఖ-ఆగమ సలహామండలి సభ్యుల సూచనలు అనుసరించి యజ్ఞం నిర్వహించడం జరుగుతుంది. 8 ఆగమములకు సంబంధించిన దేవాలయముల నుండి 8 ఆగమములకు సంబంధించిన ఋత్వికులను, పరిచారికులను, సహాయకులను ఆయా ఆగమ దేవాలయము నుంచి మరియు ఆగమ పండితులను జిల్లాల నుండి ఎన్నిక చేయడం జరుగుతుంది.

ఈ మహా యజ్ఞం యొక్క సంకల్పం రాష్ట్ర ప్రజలు అందరికి సకల శుభములు లభించడం కోసం, 4 వేధములకు సంబంధించిన 64 వేద పండితులతో సంపూర్ణ వేద పారాయణం గావించి ఏతత్ మహా ఫలమును దారపోయడం జరుగుతుంది. వేదపండితులను ఆయా దేవాలయముల నుండి డిప్యూటేషన్ పై నియమింపబడుతుంది.

# 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలి



**మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజావార్త :**
18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాష ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రోల్ అధికారులను (ఈఆర్వోలను) ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల అధికారి ఎంకే మీనా గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబితాలలో మార్పులు చేర్పులు, ఓటర్లకు ఫోటో గుర్తింపు కార్డులు ముద్రణ, పంపిణీ, ఎన్నికల పిటిషన్ల పరిష్కారం, ఓటర్ల జాబితాలపై క్లైములు అభ్యంతరాలు వాటి పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ బంగ్లా నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు జిల్లాలో 2023 ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం తుది జాబితా ప్రకారం 14,61,634 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లాలో కొత్తగా నమోదైన ఓటర్లకు సంబంధించి 38 వేల ఫోటో గుర్తింపు కార్డులు ముద్రించి పంపిణీ గావించినట్లు తెలిపారు. జిల్లాలో ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించి, ఓటర్ల జాబితాలలో క్లైములు, అభ్యంతరాలు సంబంధించి ఫారం 6 జిల్లాలో 15,620 వచ్చాయని వాటిలో 10680 పరిష్కరించినట్లు, ఫారం-7 19,170 వచ్చాయని వాటిలో 17,143 పరిష్కరించినట్లు, ఫారం-8 8,474 వచ్చాయని వాటిలో 5,766 పరిష్కరించినట్లు తెలిపారు. పెండింగ్ క్లైములు సత్వరమే పరిష్కరించాలన్నారు. బిఎల్ఓ లందరూ నిర్దేశించిన 1 నుండి 7 వరకు రిజిష్టర్లు నిర్వహించేలా చూడాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ. ఎం.వెంకటేశ్వర్లు, వివిధ అసెంబ్లీ నియోజక వర్గాలకు ఈఆర్వోలుగా ఉన్న ఆర్డీవోలు పద్మావతి, ఐ.కిషోర్, డీఎస్ఓ పార్వతి, ముడ విసి రాజ్యలక్ష్మి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ విభాగం సూపరిన్టెంట్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో ప్రవేశానికి మైనార్టీ విద్యార్థులు ధరఖాస్తు చేసుకోండి

### జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సంషున్నీసా బేగం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే గురుకుల పాఠశాలలో 5 నుండి 8వ తరగతులలో ప్రవేశాలకై ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఈనెల 24వ తేదీలోగా అన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సంషున్నీసా బేగం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీ ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్య ఉచిత వసతి, పౌష్టికాహారంతో కూడిన భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య భోదనను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ద్వారా గురుకుల పాఠశాలలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాల ద్వారా విద్యను అభ్యసించేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఐదు నుండి ఎనిమిదవ తరగతులలో ప్రవేశాలకై https://aprs.apcfss.in అన్‌లైన్ ద్వారా ఈనెల 24వ తేదీ లోపు ధరఖాస్తులను చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాల కొరకు మే 20వ తేదీన అన్ని జిల్లాల ప్రాధాన కేంద్రాలలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలలో అర్హత పొందిన వారికి ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. విజయవాడ భవానిపురంలో గల మైనార్టీ గురుకుల పాఠశాలలో బాలికలకు, మచిలీపట్నం చిలకలపూడి నందు గురుకుల పాఠశాలలో బాలురులకు ప్రవేశానికై ముస్లిం మైనార్టీ విద్యార్థులు ధరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సంషున్నీసా బేగం ఆ ప్రకటనలో తెలిపారు.

# ముస్లిం సోదరులకు ఈనెల 17న రాష్ట్ర ప్రభుత్వ ఇఫ్తార్ విందు

### - ఇఫ్తార్ విందుకు హాజరు కానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ తరుపున ముస్లీమ్ సోదరులకు ఈనెల 17వ తేదీన ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారని, ఇఫ్తార్ విందులో ముస్లీమ్ సోదరులు పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ బాషా పిలుపు నిచ్చారు. ఈనెల 17వ తేదీన విద్యాదరపురం బైపాస్ రోడ్డులో గల స్టేడియం నందు నిర్వహించనున్న ఇఫ్తార్ విందు ఏర్పాట్ల పై అంజాద్ బాషా, జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా, శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావులు సంబంధిత అధికారులతో కలిసి గురువారం కలెక్టర్ విడిది కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

అనంతరం మీడియా ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఈనెల 17వ తేది ముస్లిం, మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. విద్యాదరపురం స్టేడియం గ్రౌండ్ నందు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల మంది ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుకు హాజరయ్యే అవకాశం ఉందని ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. సాయంత్రం 5 గంటల నుండి ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు. సమయానికంటే ముందుగానే ముస్లిమ్ సోదరులు ఇఫ్తార్ విందులో పాల్గొనేందుకు స్టేడియంకి చేరుకుంటారన్నారు. ముస్లిం సోదరులకు స్టేడియం నందు అసర్ నమాజ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఇఫ్తార్ విందులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి నమాజ్‌లో పాల్గొంటారన్నారు. సుమార్ 5 వేల మందికి పైగా సామూహిక మగ్రీబ్ నమాజ్ చేసుకునేందుకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నమాజ్‌కు ముందు ముస్లిం సోదరులు ఒక్కపొద్దు విడిచినప్పుడు వారికి పండ్ల ముక్కలు, ఖర్జూర, గంజి, బూందిలను అల్పాహారం కింద అందజేయడం జరుగుతుందన్నారు. నమాజ్ అనంతరం ఇఫ్తార్ విందు భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఇఫ్తార్ విందుకు ఎన్‌టిఆర్ కృష్ణాజిల్లాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుండి ముస్లీమ్ సోదరులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, శాసనమండలి సభ్యులు తలశిల రఘురామ్, యండి రూహుల్లా, రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర ప్రోటోకాల్ డైరెక్టర్ యం.బాలసుబ్రమణ్యం రెడ్డి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ ఆడపాశేషు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, వక్ఫ్‌బోర్డ్ స్పెషల్ ఆఫీసర్ షరీన్ బేగం, సిఇవో అబ్దుల్ ఖాధీర్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఖాజా మస్తాన్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సంషున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో భూ సర్వే ప్రక్రియ పూర్తిచేస్తాం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా ఈనెల 20వ తేదీ లోగా సర్వే రాళ్ళను పాతే ప్రక్రియను పూర్తి చేస్తామని కలెక్టర్ డిల్లీరావు సిసిఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, అదనపు కార్యదర్శి ఏ.యండి. ఇంతియాజ్‌కు వివరించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రీ సర్వే పనుల ప్రగతిని సిసిఎల్ఏ కార్యాలయం నుండి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, అదనపు కార్యదర్శి ఏ.యండి. ఇంతియాజ్, జాయింట్ సెక్రటరీ ప్రభాకరరెడ్డిలు అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సర్వే అధికారులతో గురువారం వీడియోకాన్ఫరెస్ నిర్వహించారు. నగరంలోని కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా రీసర్వే పనులు నిర్ధేశించిన గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూ సర్వే ప్రక్రియకు సంబంధించి సర్వే రాళ్ళను పాతే ప్రక్రియ (స్టోన్ ప్లాంటేషన్) వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాకు కేటాయించిన 24,169 సర్వే రాళ్ళలో ఇప్పటికే 20 వేలకు పైగా రాళ్ళను పాతడం జరిగిందని, మిగిలిన వాటిని నిర్ధేశించిన గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ అన్నారు. రిసర్వే వివరాలను వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియలో భాగంగా 14 గ్రామాలకు గాను ఇప్పటికే 6 గ్రామాలకు సంబంధించి వివరాలను అప్‌లోడ్ చేయడం జరిగిందని మిగిలిన 8 గ్రామాలకు సంబంధించిన వివరాలను ఈనెల 20వ తేదీలోపు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూ హక్కు పత్రాల అప్‌లోడ్‌కి సంబంధించి 12,647 పత్రాలకు గాను 12 వేలకు పైగా అప్‌లోడ్ చేయడం జరిగిందని మిగిలిన ప్రక్రియను మే 5వ తేదీలోగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డిల్లీరావు సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్‌కు వివరించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా సర్వే అధికారి కె.సూర్యారావులు ఉన్నారు.

# ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించి ఖచ్చితమైన ఓటర్ల జాబితా



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఓటర్ల జాబితాలో చేర్పులు తొలగింపులను ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించి ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఇవోలు, ఏఆర్వోలు ఈఆర్వోలతో సచివాలయం నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఓటర్ల జాబితాలో చేర్పులు తొలగింపులు, ఓటర్లకు పివిసి-ఇపిఐసి (ఎలక్ట్రోరల్ ఫోటో ఐడిరటి కార్డు) పంపిణీ తదితర అంశాలపై గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టర్ విడిది కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితాకు 7,914 కొత్తగా నమోదు కాగా 46,347 ఓటర్లను తొలగించడం జరిగిందన్నారు. ఓటర్ల జాబితాలో నమోదు, తొలగింపు ప్రక్రియలో ఎన్నికల నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. 2023 మార్చి 26 నాటికి జిల్లాలో 15,95,354 ఓటర్లు నమోద్కై ఉన్నారన్నారు. పివిసి-ఇపిఐసి (ఎలక్ట్రోరల్ ఫోటో ఐడిరటి కార్డు) ఓటర్లకు స్పీడ్‌పోస్టు ద్వారా పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ అన్నారు. ఓటర్ల జాబితాలో మొదటిసారి ఓటరుగా నమోదు, ఒక నియోజకవర్గంలో నుండి మరో నియోజకవర్గానికి బదిలీపై నమోదుకు సమర్పించే పారం 6, ఓటరు తొలగింపు కై ఫారం 7, మోడిఫికేషన్, క్లెయిమ్స్, అబ్జెక్షన్స్‌కు సమర్పించే ఫారం 8, తదితర దరఖాస్తులకు సంబంధించి పరిష్కరించే ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో డెమోగ్రాఫీకల్లీ సిమిలర్ ఎంట్రీస్ (డిఎస్ఈ) ఫోటో సిమిలర్ ఎంట్రీస్ (పిఎస్ఇ) సంబంధించి ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ డిల్లీరావు అన్నారు.

# రూ.42 కోట్లతో కాకినాడ జిజిహెచ్‌లో ఎంసిహెచ్ భవనం

**మంగళగిరి, నేటి పత్రిక ప్రజావార్త :**
కాకినాడ జిజిహెచ్ లో రూ.42 కోట్లతో మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసిహెచ్) భవనాన్ని నిర్మించేందుకు, వైద్య పరికరాల్ని ఏర్పాటు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖతో రంగరాయ మెడికల్ కాలేజ్ అల్యుమిని ఆఫ్ నార్త్ అమెరికా(ఆర్ ఎంకానా) ప్రతినిధులు వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఆధ్వర్యంలో డిఎంఇ డాక్టర్ వినోద్ కుమార్ తో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. మంగళగిరిలోని ఎపిఐఐసి భవనం ఆరోఫ్లోర్‌లోని ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు ఛాంబర్లో ఆర్ ఎంకానా వ్యవస్థాపకులు , రంగరాయ మెడికల్ కాలేజ్ రెండో బ్యాచ్‌కు చెందిన డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్ర నాథ్ (ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ వైస్ చైర్మన్ ), డాక్టర్ పాలడుగు రాంబాబు, డాక్టర్ ఎస్వీ లక్ష్మీ నారాయణ, కాకినాడ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత పాల్గొన్నారు. ఎంసిహెచ్ భవన నిర్మాణానికి ముందుకొచ్చిన రంగరాయ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం(ఆర్ ఎంకానా) ప్రతినిధులకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణ బాబు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



నాడు-నేడు పథకం కింద సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పన కార్యక్రమాల్ని స్ఫూర్తిగా తీసుకుని తాము ముందుకొచ్చామని ఆర్ ఎంకానా ప్రతినిధులు తెలిపారు. కాకినాడ జిజిహెచ్‌లో రూ.20 కోట్లతో ఎంసిహెచ్ భవనం గ్రౌండ్, మొదటి ఫ్లోర్లను ఇప్పటికే ప్రభుత్వం నిర్మించింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని సూచనల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఆధ్వర్యంలో ఆర్ ఎంకానాతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని డిఎంఇ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఐఎఎస్ అన్నారు.

18 నెలల్లో ఎంసిహెచ్ భవనాన్ని నిర్మించి పూర్తి స్థాయి సౌకర్యాలతో ఆర్ ఎంకానా ప్రభుత్వానికి అందజేస్తుంది.

అధునాతన సౌకర్యాలతో కూడిన మాతా శిశు సంరక్షణ సేవలు, నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ అందుబాటులోకొస్తాయి. గ్రౌండ్ ఫ్లోర్లో 12 ల్యాబర్ టేబుళ్లు, 40 పడకల యాంటీ నేటల్ వార్డు, 2 ఎమెర్జగన్సీ ఆపరేషన్ థియేటర్లు, మొదటి ఫ్లోర్లో 75 పడకల పోస్ట్ నేటల్ వార్డు, రెండో ఫ్లోర్లో 2 అధునాతన ఎలక్టివ్ ఆపరేషన్ థియేటర్లు, మూడు నాలుగు ఫ్లోర్లలో నియోనేటల్‌వార్డు వంటి సౌకర్యాలు సమకూరనున్నాయి. వెంటిలేటర్, ఫోటో థెరపీ సదుపాయాలు అందుబాటులోకొస్తాయి. వచ్చే నెలలో సివిల్ వర్క్ను ప్రారంభించి 2024 డిసెంబర్ నాటికి అంటే 18 నెలల్లో నిర్మాణపు పనులన్నీ పూర్తి చేసి ఎంసిహెచ్ భవనాన్ని అందుబాటులోకి తెచ్చేలా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. సుమారు 1.50 లక్షల చదరపు అడుగుల ప్లింత్ ఏరియాలో ఎంసిహెచ్ భవనాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మించనున్నారు. నాడు-నేడు పథకానికి వైద్య ఆరోగ్య రంగంలో మౌలిక వసతుల కల్పనకు సిఎం జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టగా అందులో భాగంగా అభివృద్ధి పనులకు కొనసాగింపుగా కాకినాడ జిజిహెచ్‌లో ఎంసిహెచ్ భవనం నిర్మాణానికి ఆర్ ఎంకానాతో ఎంవోయూ కుదుర్చుకోవడం ముదావహమని వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మొవ్వా తిరుమల కృష్ణబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఈనెల 22న పీఎస్ఎల్వీ సీ-55 ప్రయోగం



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈనెల 22న సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ-55 ప్రయోగం చేపట్టేందుకు శాస్త్రవేత్తలు సిద్ధం చేస్తున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఉన్న పీఐఎఫ్ భవనంలో పీఎస్ఎల్వీ మొదటి, రెండు దశలు రాకెట్ అనుసంధానం పూర్తి చేశారు. మూడు, నాలుగు దశలను మొబైల్ సర్వీస్ టవర్‌లో అనుసంధానం చేసి సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రయోగంలో సింగపూర్‌కు చెందిన ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్నారు.

## ప్రతిఒక్కరికి 3 వేల విలువ జనరల్ చెకప్ వైద్య పరీక్షలు



**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**
ప్రజల భవిష్యత్ ఆరోగ్యంతో ముడిపడివుంది, ప్రాధమిక దశలో వైద్య పరీక్షలు చేసుకోక, అవగాహన లేక వ్యాధి ముదిరాక ఆసుపత్రికి వస్తున్నారు, ఆరోగ్యశ్రీలో వైద్యం అందించినా వ్యాధి తీవ్రత కావడం వల్ల జీవనం భారం అవుతున్న విషయం తెలిసిందే అందుకే ప్రతిఒక్కరికీ వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించామని ఇది ఒక యజ్ఞం అని ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో ప్రయోగాత్మకంగా చంద్రగిరి నియోజకర్గంలో ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా సమన్వయ సమావేశం నిర్వహించగా ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీలు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా అందరినీ ఆరోగ్య వంతులుగా చేయడంలో యజ్ఞంగా తుడా భాగస్వామ్యంతో చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ జనరల్ చెకప్‌తో 3 వేల రూపాయల విలువ వైద్య పరీక్షలు ఈ నెల 24 నుండి చేపట్టనున్నామని అందుకు అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని అన్నారు. ప్రతిఒక్కరికి 3 వేల రూపాయల విలువ వైద్య పరీక్షలు 4 వేల మందికి నిర్వహించేలా 90 రోజులలో నియోజకవర్గంలో పూర్తి అయ్యేలా జిల్లా యంత్రాంగం చొరవ చూపాలని అన్నారు. ఇది మన దేశంలోనే అందరికీ వైద్య పరీక్షలు మొదటి ప్రయోగం అని అన్నారు. సచివాలయ సిబ్బంది పూర్తి స్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మనం చేస్తున్న ఈ జనరల్ చెకప్ ప్రయోగంలో వైద్య పరీక్షలకు హాజరయ్యే ప్రజలకు ఆలస్యం కాకుండా టైమ్ స్లాట్ ఇవ్వాలి, సచివాలయ పరిధిలో వున్న ప్రతిఒక్కరికీ వైద్య పరీక్షలు అందాలి, ఆవిధంగా అవగాహన కల్పించాలి అన్నారు. ప్రణాళిక సిద్దం కావాలని, వైద్య పరీక్షల నిర్వహణ ప్రాంతాలు ముందుగా ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుడ విసి హరికృష్ణ, జిల్లా అధికారులు,వైద్య శాఖల అధికారులు, చంద్రగిరి నియోజకవర్గ మండల స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

## అలిపిరిలో దివ్యదర్శన టోకెన్ల జారీ

**తిరుపతి, నేటి పత్రిక ప్రజావార్త :**
తిరుమల శ్రీవారి దర్శనానికి అలిపిరి నుంచి కాలినడకన వచ్చే భక్తులకు ఇప్పటివరకు గాలిగోపురం వద్ద ఇస్తున్న దివ్యదర్శన టోకెన్ల జారీ కేంద్రాన్ని తితిదే మార్పు చేసింది. అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో శుక్రవారం నుంచి టోకెన్లను జారీ చేయనున్నారు. టోకెన్లు పొందిన భక్తులు అలిపిరి కాలినడక మార్గంలోని గాలిగోపురం వద్ద ఉన్న కేంద్రంలో స్కాన్ చేసుకోవాలి. స్కాన్ చేసుకోకపోయినా, ఇతర మార్గాల్లో తిరుమల చేరుకున్నా.. స్వామివారి దర్శనానికి అనుమతించరు. శ్రీవారి మెట్టుమార్గంలో జారీ చేస్తున్న దివ్య దర్శన టోకెన్లను అక్కడే ఇస్తారు. అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో ఇప్పటివరకు జారీ చేస్తున్న సమయ నిర్దేశిత సర్వదర్శన టోకెన్ల (ఎస్ఎస్‌డీ) కేంద్రాన్ని విష్ణునివాసం యాత్రికుల వసతి సముదాయానికి మార్చారు.

# దేశంలోనే బెస్ట్ టూరిజం స్పాట్‌గా ఆంధ్రప్రదేశ్

### - రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు, యువజనాభివృద్ధి శాఖల మంత్రి ఆర్కే రోజా



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా రాష్ట్ర పర్యాటకరంగానికి నూతనోత్తేజం వచ్చిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు, యువజనాభివృద్ధి శాఖల మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు మరియు యువజనాభివృద్ధి శాఖలపై విజయవాడ బెర్మ్‌పార్క్‌లో మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ జీఐఎస్ ద్వారా ఏపీ ప్రభుత్వం బ్రాండ్ అంటే ఏంటో పారిశ్రామికవేత్తలకు తెలిసిందని, అందుకే టూరిజం, హాస్పటాలిటీ రంగాలలో రూ.21,941 కోట్లతో 123 ఎంఓయూలు కుదుర్చుకున్నామన్నారు. దీని ద్వారా 41,412 మంది రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. జరిగిన ఎంఓయూల్లో 40 డీపీఆర్ లు ఇప్పటికే సబ్మిట్ చేయడం జరిగిందన్నారు. పెట్టుబడులకు ముందుకు వచ్చినవారికి సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేకంగా కమిటీలను సైతం ఏర్పాటు చేశామన్నారు.

భీమవరంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఆవిష్కరించడం, శ్రీశైలం మల్లన్నను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకోవడం, ఆ కార్యక్రమాల్లో తాను పాల్గొనడం గర్వకారణంగా ఉందన్నారు. యూత్ ఫెస్టివల్స్ వల్ల యువతకు తగిన ప్రోత్సాహం లభించడంతో పాటు సరైన మార్గంలో నడిచేందుకు దోహదం చేస్తాయన్నారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని కాలేజీల్లో, స్కూళ్లలో ఈవిటీజింగ్ పూర్తిగా అరికట్టారని..రాష్ట్రంలో డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపారన్నారు.

ఒబెరాయ్ గ్రూప్ ద్వారా పీపీపీ విధానంలో రాష్ట్రంలో 5 ప్రాంతాల్లో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, హార్సిలీ హిల్స్, గండికోటలో రూ.1350 కోట్ల అంచనా వ్యయంతో 7 స్టార్ హోటళ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. దీనిద్వారా 10,900 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్రంలో జల, సాహస క్రీడలను ప్రోత్సహించాలన్న ఆలోచనతో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన మొత్తం లొకేషన్లలో తొలి దశలో 21 ప్రాంతాల్లో జల, సాహస క్రీడలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. స్పార్క్ సైబర్ టెక్ లిమిటెడ్ ద్వారా రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో 100 టూరిస్టు ఇన్ఫర్మేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 29న వరల్డ్ డాన్స్ డే సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక మరియు యువజనాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే టెంపుల్ టూరిజంలో ఏపీ దేశంలోనే మూడవ స్థానంలో ఉందన్నారు. తిరుపతి టెంపుల్ టూరిజంతో పాటు విశాఖలో నేచురల్ టూరిజం అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఈ సమీక్షా కార్యక్రమంలో పర్యాటక ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రజత భార్గవ, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కన్నబాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్ రెడ్డి, బలరాం రెడ్డి, క్రీడా ప్రాధికారిక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హర్షవర్ధన్, యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదా దేవి, రాష్ట్ర సాంస్కృతిక ముఖ్య కార్యనిర్వాహణాధికారి మల్లికార్జున, శిల్పారామం ముఖ్య కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి, పర్యాటక శాఖ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి రాముడు, ఎన్సీసీ అధికారులతో పాటు జిల్లా స్థాయి పర్యాటక, క్రీడా యువజన సర్వీసుల మరియు బెర్మ్ పార్క్ అధికారులు పాల్గొన్నారు.

# తృణధాన్యాల వినియోగంపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన పెంపొందించాలి

### -ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్ర వ్యాప్తంగా తృణధాన్యాల వినియోగంపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహనను పెంపొందించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవహర్ రెడ్డి అన్నారు.ఐక్యరాజ్య సమితి 2023 ఏడాదిని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిన నేపధ్యంలో ఈఅంశంపై గురువారం వెలగపూడి సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తృణధాన్యాల సాగుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో అనుకూలమైనదని రాష్ట్రంలో ఈఏడాది లక్షా 27వేల హెక్టార్లలో తృణధాన్యాలను సాగుచేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్టు తెలిపారు. తృణధాన్యాలు సాగుచేసే రైతులకు ప్రభుత్వపరంగా తగిన మద్దత్తు ధరను ఇచ్చి ప్రోత్సహించడంతోపాటు ఆయా ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అదే విధంగా తృణధాన్యాల ప్రోసెసింగ్ యూనిట్లు నెలకొల్పే వారికి తగిన విధంగా ప్రోత్సాహకాలను అందించాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో తృణధాన్యాల ఉత్పత్తులకు సంబంధించిన ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాల కృష్ణ ద్వివేదిని సిఎస్ ఆదేశించారు.

జొన్నలు, సజ్జలు, రాగులు వంటి తృణధాన్యాల్లోని పిండి పదార్థాల వల్ల దైనందిన అవసరాలకు సరిపడా 70-80శాతం శక్తిని అందిస్తాయని భారీపరిమాణాల్లో వినియోగిస్తుంటే ఇవి ఇతర పోషకపదార్థాలైన మాంసకృత్తులు, కాల్షియం, ఐరన్ మరియు బి కాంప్లెక్స్ విటమిన్లను కూడా అందజేస్తాయని సిఎస్ డా.జవహర్ రెడ్డి పేర్కొన్నారు.

అంతకు ముందు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో తృణధాన్యాల సాగు ప్రోత్సాహానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమీషనర్ హెచ్.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పౌర పంపిణీ విధానం ద్వారా ప్రజలకు సరఫరాకు రాగులు 9వేల 145 మెట్రిక్ టన్నులు, జొన్నలు 4వేల 303 మెట్రిక్ టన్నులు అవసరం ఉందని చెప్పారు. దృశ్యమాధ్యమం ద్వారా పాల్గొన్న సెర్ప్ సిఇఓ ఇంతియాజ్ మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల మహిళలు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా తృణధాన్యాల వినియోగ ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇప్పటికే 52 మిల్లెట్ ఫెస్ట్ అండ్ ఎగ్జిబిషన్లను నిర్వహించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండి వీరపాండ్యన్, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్, ఆహారశుద్ధి విభాగం సిఇఓ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కొన్ని రోజులుగా నమోదవుతున్న కోవిడ్ కేసులు ఆందోళన

**న్యూఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :**
భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా నమోదవుతున్న కోవిడ్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. రోజూవారీ పాజిటివ్ కేసుల్లో భారీగా పెరుగుదల కనిపిస్తోంది. తాజాగా కొత్త కేసుల సంఖ్య 10 వేలు దాటాయి. గడిచిన 24 గంటల్లో 10,158 మంది వైరస్ బారిన పడ్డారు. కిందటి రోజుతో పోలిస్తే 30శాతం అధికంగా నమోదయ్యాయి. గత గత ఏడు నెలల్లో(230 రోజులు) ఇంత భారీ స్థాయిలో పాజిటివ్ కేసులు వెలుగు చూడటం ఇదే తొలిసారి. మేరకు కేంద్ర వైద్యారోగ్యశాఖ గురువారం హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. ఇప్పటివరకు మొత్తం కేసుల సంఖ్య 4,42,10,127కు చేరింది. ప్రస్తుతం 44,998 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రోజువారీ పాజిటివ్ రేటు 4.42శాతానికి పెరిగింది. రికవరీ రేటు 98.71శాతం.. మరణాల రేటు 1.19%గా ఉంది. భారత్‌లో సగటున గత వారంలో రోజుకు 5,555 కోవిడ్ కేసులు నమోదవ్వగా అంతకు ముందు వారం 3,108 వెలుగు చూశాయి. అయితే కరోనా వ్యాప్తి పెరుగుతున్నప్పటికీ ప్రస్తుతం దేశంలో కోవిడ్ ఎండమిక్ దశలోకి ప్రవేశిస్తోందని వైద్య నిపుణులు వెల్లడించారు. వచ్చే 10 నుండి 12 రోజుల్లో కొత్త కేసులు పెరుగుతాయని పేర్కొన్నారు. కానీ ఆ తర్వాత కేసులు తగ్గుతాయని తెలిపారు. ఒకవైపు కరోనా కేసులు పెరుగుతున్నప్పటికీ ఆస్పత్రిలో చేరికలు మాత్రం తక్కువగా ఉన్నాయని రాబోయే రోజుల్లో కూడా ఇలాగే కొనసాగుతుందని చెప్పారు. అయితే కొత్త కేసులపై ఆందోళన అవసరం లేదని అన్నారు. తగు జాగ్రత్తలు తీసుకుంటూ వైరస్ వ్యాప్తిని అడ్డుకుంటే చాలని.. దీర్ఘకాలిక వ్యాధులు, శ్వాసకోశ ఇబ్బందులు ఉన్న వాళ్లు మాత్రం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా ప్రస్తుతం దేశంలో ఒమిక్రాన్ సబ్ వేరియెంట్ ఎక్స్‌బీబీ.1.16 కారణంగా భారత్‌లో కరోనా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు

# భగ్గుమంటున్న భానుడు..

**విశాఖపట్నం, నేటి పత్రిక ప్రజావార్త :**
ఈ సీజనులో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. భానుడు నిప్పులు చెరిగుతున్నాడు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా బుధవారం 40.2 డిగ్రీల ఉష్ణతాపాన్ని వెదజల్లాడు. సాధారణంగా విశాఖలో ఏప్రిల్‌లో పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 37-38 డిగ్రీలకు మించవు. అంతకు మించి ఉష్ణోగ్రతలు అరుదుగా నమోదవుతాయి. విశాఖ జిల్లాలోను, నగరంలోను గత కొద్ది రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. బుధవారం నాటికి అవి మరింత తీవ్రతరమయ్యాయి. విశాఖతో పాటు జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలో 40.56, ములగాడ మండలం నావల్ వార్ఫ్‌లో 40.51, పద్మనాభం మండల కేంద్రంలో 40.09, సింహాచలంలో 40, గాజువాకలో 39 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఉదయం నుంచి మొదలైన ఎండ మధ్యాహ్నానికి ఉధృతమైంది. అలా సాయంత్రం నాలుగు గంటల వరకు ఉష్ణ తీవ్రత కొనసాగింది. వేసవి తాపానికి జనం విలవిల్లాడారు. సాయంత్రం అయ్యే వరకు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడ్డారు. సాధారణ ఉష్ణోగ్రతలకంటే 4.5 డిగ్రీలకు మించి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైతే వడగాడ్పులుగా నిర్ధారిస్తారు. బుధవారం విశాఖలో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఇది సాధారణంకంటే 4.9 డిగ్రీలు అధికం. వరసగా రెండు రోజులు ఇవే ఉష్ణోగ్రతలు కొనసాగితే వడగాడ్పుల హెచ్చరికలు జారీ చేస్తారు.

రానున్న రెండు మూడు రోజులు ఇవే ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు చెప్పారు.

ఐఎండి అంచనాల ప్రకారం రేపు 7 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 168 మండలాల్లో వడగాల్పులు, ఎల్లుండి 106 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎండ నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. డా.బి.ఆర్ అంబేద్కర్, మేనేజింగ్ డైరెక్టర్, విపత్తుల నిర్వహణ సంస్థ రేపు మండలాలు(168)లకు వడగాల్పులు వీచే అవకాశం



ఉన్నదన్నారు. అల్లూరిసీతారామరాజు జిల్లా 7, అనకాపల్లి 13, తూర్పుగోదావరి 14, ఏలూరు11, గుంటూరు11, కాకినాడ 14, కోనసీమ 6, కృష్ణా 11, నంద్యాల 4, ఎన్టీఆర్ 16, పల్నాడు 8, పార్వతీపురంమన్యం 12, శ్రీకాకుళం 13, విశాఖపట్నం 4, విజయనగరం 22, వైఎస్సార్ 2 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉంది. గురువారం అనకాపల్లి 8, కాకినాడ 1, నంద్యాల1, విజయనగరం1 మండలంలో తీవ్రవడగాల్పులు, 60 మండలాల్లో వడగాల్పులు నమోదైనవి.

## టెన్త్ విద్యార్థులకు గుడ్‌న్యూస్! పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్రంలోని పదో తరగతి విద్యార్థులకు మేలు జరిగేలా పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఎవరైనా విద్యార్థి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నిర్ణీత ప్రశ్నల సంఖ్య కన్నా ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు రాసి ఉంటే.. వాటిలో ఎక్కువ మార్కులు వచ్చిన సమాధానాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ విద్యార్థి మొత్తం మార్కులను నిర్ణయించనున్నారు. తక్కువ మార్కులు వచ్చిన ప్రశ్నల జవాబులను తీసివేయనున్నారు. ఈ మేరకు తాజాగా పాఠశాల విద్యాశాఖ ప్రొసీడింగ్స్ విడుదల చేసింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 3నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నెల 18వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.

19 నుంచి మూల్యాంకనం

ఈ నెల 19నుంచి 26వ తేదీ వరకు విద్యార్థుల సమాధాన పత్రాల మూల్యాంకన చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూల్యాంకన ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ పలు మార్గదర్శకాలతో కూడిన ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 జిల్లా కేంద్రాల్లో (పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, నంద్యాల జిల్లా కేంద్రాలు మినహా) మూల్యాంకనకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

ఇందుకోసం అన్ని జిల్లాల విద్యా శాఖాధికారులకు మార్గదర్శకాలతో కూడిన బుక్‌లెట్లను కూడా పాఠశాల విద్యాశాఖ అందించింది. ఆయా జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలన్నిటినీ ఏర్పాటు చేసే బాధ్యతను ఆయా జిల్లాల విద్యా శాఖాధికారులకు అప్పగించింది. మూల్యాంకనం సందర్భంగా అందులో పాల్గొనే సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులను తాజా ప్రొసీడింగ్స్‌లో కమిషనర్ వివరించారు. వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిన బాధ్యత డీఈవోలదేనని స్పష్టం చేశారు.

మార్గదర్శకాలు ఇవీ

మూల్యాంకనంలో పాల్గొనే అసిస్టెంట్ ఎగ్జామినర్లు రోజుకు 40 సమాధానాల పత్రాలను మాత్రమే మూల్యాంకన చేయాలి. అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకన చేసే సమాధాన పత్రాలన్నిటినీ స్పెషల్ అసిస్టెంట్లు పూర్తిగా పరిశీలన చేసి మార్కులను లెక్కించాలి. పరీక్ష రాసిన అభ్యర్థి నిర్ణీత సంఖ్యకు మించి ప్రశ్నలకు సమాధానాలు రాశాడా అన్న అంశాన్ని స్పెషల్ అసిస్టెంట్లు గమనించాలి. ఒకవేళ నిర్ణీత సంఖ్యకు మించి ప్రశ్నలకు సమాధానం రాసి ఉంటే.. వాటిని మూల్యాంకనం చేసి మార్కులు వేశారా? లేదా అన్న విషయాన్ని కూడా పరిశీలన చేయాలి. అదనంగా రాసిన ప్రశ్నల సమాధానాలను అసిస్టెంట్ ఎగ్జామినర్ మూల్యాంకన చేసి మార్కులు ఇచ్చినట్టయితే ఎక్కువ మార్కులు వచ్చిన సమాధానాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని విద్యార్థికి నిర్ణీత ప్రశ్నల సంఖ్య మేర మార్కులను కేటాయించాలి. తక్కువ మార్కులు వచ్చిన ప్రశ్నల సమాధానాలను పరిహరించాలి. అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకన చేసిన సమాధాన పత్రాల్లోని కనీసం 20 ఆన్సర్ స్క్రిప్టులను ఆయా కేంద్రాల్లోని చీఫ్ ఎగ్జామినర్లు పరిశీలించాలి.

రోజులో మొత్తంగా 60 వరకు ఆన్సర్ స్క్రిప్టులను పరిశీలన చేయాలి. అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు మూల్యాంకన పూర్తయిన రెండు సమాధానాల పత్రాలను పరిశీలించాలి. అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకన చేసిన సమాధాన పత్రాల్లో డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ ప్రతి రోజూ కనిష్టంగా 45 పత్రాలను పరిశీలన చేయాలి. అసిస్టెంట్ ఎగ్జామినర్లు మూల్యాంకనం చేసిన సమాధాన పత్రాల్లో క్యాంప్ ఆఫీసర్ ప్రతి రోజూ కనిష్టంగా 20 పత్రాలను పరిశీలించాలి.

పొరపాట్లు జరిగితే చర్యలే

పరీక్ష ఫలితాల వెల్లడి అనంతరం అభ్యర్థులకు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు అవకాశం, ఫొటోస్టాట్ కాపీలను అందించడం వంటివి ఉన్నందున మూల్యాంకనంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందునుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ల సమయంలో ఏ విధమైన మార్పులు చేయాల్సి వచ్చినా అందుకు వరుసగా స్పెషల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు బాధ్యత వహించాల్సి ఉంటుంది. పొరపాట్లు చేసిన వారిపై నిబంధనల ప్రకారం పెనాల్టీ సహా క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకుంటారు. మూల్యాంకనాన్ని ఎలాంటి పొరపాట్లు, ఇతర అవాంఛిత అంశాలకు తావులేని విధంగా ప్రశాంతంగా ముగించేందుకు డీఈవోలు చర్యలు తీసుకోవాలి. జిల్లాస్థాయి పరిశీలకులు మూల్యాంకన కేంద్రాలను తొలి రెండు రోజులు తప్పనిసరిగా సందర్శించి తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలి.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt Ltd, D.NO: 33-5-9 Papaiah Street, Seethurampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published From H.No: 24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line cross, VIJAYAWADA Krishna District Andhra Pradesh.
Editor Konduri Srinivasarao, RNI Title APTEL/2021/80559, Phone :9948877444, Email id: konduri999@gmail.com